ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -78 పేజీలు - 05 వెల - 04/- శనివారం 28 మార్చి 2026

# టీమిండియా స్ఫూర్తితో పనిచేయాలి

## సీఎంలతో ప్రధాని మోదీ కీలక సమావేశం...

- పశ్చిమాసియా సంక్షోభంపై సీఎంలతో ప్రధాని మోదీ సమీక్ష
- ఇంధన సరఫరా, నిత్యావసరాలపై రాష్ట్రాల సన్నద్ధతపై చర్చ
- ఎన్నికల కోడ్ కారణంగా పలు రాష్ట్రాల సీఎంలు భేటీకి దూరం
- చంద్రబాబు, రేవంత్ రెడ్డి తదితర సీఎంలు హాజరు





**న్యూఢిల్లీ,మార్చి 27 ఆంధ్ర ప్రగతి**
పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన భద్రత, నిత్యావసరాల సరఫరా, రాష్ట్రాల సన్నద్ధతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో... చమురు, గ్యాస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'టీమ్ ఇండియా' స్ఫూర్తితో సమన్వయంతో పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు.
అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘర్షణ ప్రభావం భారత్ ఇంధన దిగుమతులు, ఎరువుల సరఫరా, ఇతర వాణిజ్య కార్యకలాపాలపై పడే అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మిగతా 2లో...

# కమనీయం.. సీతారామ కళ్యాణం

- మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- రామనామంతో మార్మోగిన భద్రాద్రి..భారీగా హాజరైన ప్రజలు
- పలువురు మంత్రులు, ప్రముఖుల రాక


2లో.

## సీఎం రేవంత్ సహా పలువురు స్టార్ క్యాంపెయినర్లు

### నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు



**న్యూఢిల్లీ,మార్చి 27 ఆంధ్ర ప్రగతి** నాలుగు రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. మిగతా 2లో...

# పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం

- పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు
- సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ
- పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై 10 తగ్గిస్తూ ఆదేశం




**న్యూఢిల్లీ,మార్చి 27 ఆంధ్ర ప్రగతి**
పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. మరోవైపు సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా మిగతా 2లో...

# అమరావతిపై మీ స్టాండ్ ఏంటి?

## : జగన్‌కు మంత్రి లోకేశ్ సూటి ప్రశ్న

- అమరావతి రాజధానిపై జగన్ వైఖరి చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్
- 'జే టర్న్ జగన్' అంటూ సోషల్ మీడియాలో విమర్శ
- ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని తమ నినాదమని స్పష్టీకరణ
- టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలని శ్రేణులకు పిలుపు
- ఇంటిపై జెండా ఎగరేసి, సోషల్ మీడియా డీపీలు మార్చాలని సూచన


2లో.

## ఇరాన్‌తో యుద్ధంలో మేం

# పూర్తిగా గెలిచాం

- ఇరాన్‌పై యుద్ధంలో పూర్తిగా గెలిచామని ప్రకటించిన ట్రంప్
- ఇరాన్ సైనిక శక్తిని దాదాపు నాశనం చేశామని వెల్లడి
- చర్చల కోసం ఇరాన్ కోరిక మేరకు 10 రోజుల గడువు ఇచ్చినట్లు స్పష్టం
- ఒప్పందం కుదరకపోతే విద్యుత్ ప్లాంట్లపై దాడి చేస్తామని హెచ్చరిక
- అణ్వాయుధం చేజిక్కించుకోకుండా ఇరాన్‌ను అడ్డుకున్నామని వ్యాఖ్య

**న్యూఢిల్లీమార్చి 27 ఆంధ్ర ప్రగతి**
ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా "పూర్తిగా గెలిచింది" అని, ఆ దేశ సైనిక సామర్థ్యాన్ని దాదాపు నాశనం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అయితే, తదుపరి చర్యలకు ముందు చర్చల కోసం టెహ్రాన్‌కు 10 రోజుల గడువు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఫాక్స్ న్యూస్ ఛానెల్‌కు ఫోన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో...



# మిషన్ కర్మయోగిలో ఎపి ఆదర్శం

## ఇది గర్వకారణమని పేర్కొన్న చంద్రబాబు



**అమరావతి,మార్చి 27 ఆంధ్ర ప్రగతి**
దేశవ్యాప్తంగా అమలవుతున్న మిషన్ కర్మయోగిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయస్థాయిలో ఆదర్శంగా నిలవడం గర్వకారణంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సాంకేతికత ఆధారిత శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల పని తీరు మెరుగుపడుతోందని. మిగతా 2లో...

# కుట్ర కోణం

- రఘురామపై దాడిని ఖండించిన పవన్..
- ఆకివీడులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై దాడి
- దాడి వెనుక కుట్ర కోణం ఉందని అనుమానం వ్యక్తం చేసిన పవన్
- దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచన
- గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**అమరావతి,మార్చి 27 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై జరిగిన దాడిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. పండుగ రోజున, ఆలయం వద్ద జరిగిన ఈ దాడి వెనుక కుట్ర కోణం ఉందని ఆయన మిగతా 2లో...

## రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నం..

### ఆకివీడులో ఉద్రిక్తత

- శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ఘటన
- రామాలయ స్థలానికి సంబంధించి రెండు వర్గాల మధ్య కొంత కాలంగా వివాదం
- రఘురామ రాకను వ్యతిరేకిస్తూ దాడికి యత్నించిన ఒక వర్గం
- పలువురు కూటమి నేతలకు గాయాలు
- రఘురామను సురక్షితంగా తరలించిన భద్రతా సిబ్బంది, పోలీసులు


2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# కమనీయం..సీతారామ కళ్యాణం

**భద్రాచలంమార్చి 27 ఆంధ్ర ప్రగతి**

శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా కొనసాగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో రఘురాముడి కళ్యాణం రమణీయంగా సాగింది. రాములవారిని, సీతమ్మను మిథిలా మండపంలో వేంచేసి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో భద్రాచలం వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరపున స్వామి వారికి సీఎం రేవంత్‌రెడ్డి, గీత దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ కల్యాణోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ భూమిపూజ చేశారు. తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవంఅంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా స్టేడియంలోని మండపంలో వేద



మంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీసీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యల శిరస్సుపై ఆలయ అర్చకులు జీలకర్ర, బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భద్రాద్రిలో జరుగుతున్న సీతారామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి శ్రీరాముని భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీరామ నామస్మరణతో మిథిలా స్టేడియం ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణం సందర్భంగా మిథిలా స్టేడియంతో పాటు రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో.. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. లక్షల మంది భక్తులు ఆలయానికి చేరుకుని పెళ్లి వేడుకను కనులవిందుగా తిలకించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగలేటి సహా పలువురు ప్రముఖులు వేడుకలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం బేగంపేట విమానాశ్రయం నుంచి కుటుంబసమేతంగా సారపాక హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం రోడ్డుమార్గాన భద్రాద్రి రాములవారి ఆలయం వద్దకు వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామిఅమ్మవార్ల వివాహ మహోత్సవానికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం 11:35 నుంచి మధ్యాహ్నం 12:25 వరకు మిథిలా స్టేడియంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం సారపాక హెలిప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరారు.

# ఇరాన్‌తో యుద్ధంలో మేం పూర్తిగా గెలిచాం

**మొదటిపేజీ తరువాయి**

అమెరికా సైనిక చర్యలతో ఇరాన్ యుద్ధం చేసే సత్తాను కోల్పోయిందని ట్రంప్ అన్నారు. "మేం ఇప్పటికే యుద్ధం గెలిచాం. సైనికపరంగా ఇరాన్‌ను పూర్తిగా ఓడించాం" అని స్పష్టం చేశారు. ఇరాన్ నౌకాదళం, వాయుసేనను దెబ్బతీశామని, చాలా వరకు క్షిపణులను, వాటి ప్రయోగ వ్యవస్థలను, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను కూడా ధ్వంసం చేశామని ఆయన వివరించారు. ఇరాన్ నాయకత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని పేర్కొన్నారు.అయితే, ఇంతటి తీవ్రమైన వ్యాఖ్యలు చేసినప్పటికీ, ఇరాన్ అభ్యర్థన మేరకే తదుపరి దాడులను వాయిదా వేసినట్లు ట్రంప్ తెలిపారు. "చర్చల కోసం మరికొంత సమయం కావాలని వాళ్లు నన్ను అడిగారు. అందుకే నేను వారికి 10 రోజుల గడువు ఇచ్చాను" అని ఆయన చెప్పారు. ప్రస్తుతం చర్చలు సజావుగానే సాగుతున్నాయని కూడా పేర్కొన్నారు. ఈ చర్చల్లో ఒప్పందం కుదరకపోతే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. "వారు చేయాల్సిన పని చేయకపోతే, నేను వారి పవర్ ప్లాంట్లను నాశనం చేస్తాను" అని తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ వంటి శత్రు దేశాలు అణ్వాయుధాలు సంపాదించకుండా నిరోధించడమే తమ లక్ష్యమని ట్రంప్ వెల్లడించారు. "ఒక ఉన్మాది లేదా పిచ్చి సిద్ధాంతం చేతిలో అణ్వాయుధం ఉండటానికి వీల్లేదు" అని అన్నారు. అమెరికా కనుక దాడి చేయకపోయి ఉంటే, ఈపాటికి ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించి, దానిని ఉపయోగించి కూడా ఉండేదని అభిప్రాయపడ్డారు. తన చర్యలపై వస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచంలోనే తమది అత్యంత శక్తివంతమైన సైన్యమని, తమకు ఎవరూ సాటిరారని ట్రంప్ పునరుద్ఘాటించారు.

# రఘురామకృష్ణరాజుపై దాడికి యత్నం..

## ఆకివీడులో ఉద్రిక్తత

**భీమవరంమార్చి 27 ఆంధ్ర ప్రగతి** ఆకివీడు పెద్దపేటలోని శ్రీరామనవమి వేడుకల్లో ఘర్షణ రాజుకుంది. ఓ వర్గం మరో వర్గంపై దాడి చేయడంతో జనసేన నాయకుడికి, ఇద్దరు కార్యకర్తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానిక పెద్దపేటలోని రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ వేడుకలను పెదపేటలోని ఒక వర్గం బహిరంగంగానే వ్యతిరేకించినట్లు సమాచారం. హరిజన పేటలో రామాలయంకు వారు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారు. మరో వర్గం అనుకూలంగా ఉంది. ఈ స్థితిలో రామాలయం నిర్మాణం చేపడతామని స్థానిక ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇటీవల



ప్రకటించారు. ఎమ్మెల్యే అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తున్న ఒక వర్గం ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకను వ్యతిరేకించారు. అయినప్పటికీ పోలీసులు బందోబస్తు మధ్య రఘురామ కృష్ణంరాజు రామాలయంలోకి వచ్చి హారతిచ్చి కొబ్బరికాయలు కొట్టి వెళ్లిపోయారు. అయితే రఘురామకృష్ణ రాజు రాకను వ్యతిరేకించిన వర్గీయులు ఆయన రాకను అడ్డుకున్నారు. దాడికి దిగారు. ఈ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కొందరిపై ఎమ్మెల్యే వెళ్ళిపోగానే మరోసారి దాడి జరిగింది. ఈ దాడిలో జనసేన నాయకుడు గవర అనిల్ తీవ్రంగా గాయపడ్డారు. అతనిపై ఇనప వస్తువులు గాజు వస్తువులతో దాడి చేసినట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు కార్యకర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వీరందరినీ స్థానిక పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు వైద్య సహాయం అందించారు. దాడిని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. అయితే ఈ దాడి ఒక పథకం ప్రకారం ఎమ్మెల్యే పై జరగవలసిందని, తప్పిందని అక్కడ కొందరు గుసగుసలాడుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయం ఎమ్మెల్యే చెవికి చేరడంతో తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కార్యకర్తల పై దాడి తనపై చేసిన ప్రయత్నం ఎలాంటి పరిస్థితుల్లో వదిలేది లేదని హెచ్చరించారు.

# కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

## మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలి -సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ,,మార్చి 27 ఆంధ్ర ప్రగతి** కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రధానంగా మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సిజెఐ గతవారం 25 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీల భర్తీ విషయాన్ని, ధర్మాసనాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరముందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యంగా కోర్టుల్లో మహిళా జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయవద్దని, ఖాళీ కానున్నాయని తెలిసిన వెంటనే వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జడ్జీలకు సూచించారు.

న్యాయరంగంలోని మరింత మంది మహిళలు వచ్చేలా న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు



చేపట్టాల్సి వుందని మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. హైకోర్టు కొలీజియంలు జడ్జీల పదవుల భర్తీ కోసం ప్రతిభావంతులైన మహిళా జడ్జీలను మినహాయించకుండా, వారిని కేటాయించడం ఒక నిబంధనగా పరిగణించాలని అన్నారు. పదోన్నతి కోసం తమ పరిశీలన పరిధిని విస్తృతం చేయాలని, తమ రాష్ట్రాల్లోని, సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవ్యాదులను కూడా చేర్చుకోవాలని హైకోర్టు జడ్జీలకు సూచించారు. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో పలువురు మహిళలు ప్రధాన జడ్జీలుగా విధులు నిర్వహిస్తున్నారని, పంజాబ్, హర్యానా హైకోర్టులో 18మంది మహిళా జడ్జీలు ఉన్నారని పేర్కొన్నారు. మద్రాస్, ముంబయి హైకోర్టుల్లో కూడా సుమారు 12మంది మహిళా జడ్జీలు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో మహిళలు సుమారు 36.3శాతం ఉన్నారని సిజెఐ పేర్కొన్నారు. ఇది ఒక సాధారణ గణాంకం కాదని, ఇది తరాల మార్పును ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యవస్థ పునాదిలోనే ఎక్కువ మహిళా భాగస్వామ్యం ఉన్నప్పుడు, అది అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా త్వరలోనే ప్రతిబింబిస్తుందని అన్నారు.

# పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గించిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి**

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది. మరోవైపు, దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

# టీమిండియా స్ఫూర్తితోపనిచేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఈ సమీక్ష చేపట్టారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూడటం, సరఫరా గొలుసును పటిష్ఠపరచడం, నల్లబజారు, కృత్రిమ కొరతను నివారించడం వంటి అంశాలపై ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ సహా పలువురు ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. అయితే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమలులో ఉన్నందున తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు ఈ భేటీకి హాజరుకాలేదు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో క్యాబినెట్ సెక్రటేరియట్ విడిగా సమావేశమవుతుందని కేంద్రం తెలిపింది.

# సిఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

**మొదటిపేజీ తరువాయి**

మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

# అమరావతిపై మీ స్టాండ్ ఏంటి?

## : జగన్‌కు మంత్రి లోకేశ్ సూటి ప్రశ్న

**అమరావతి,మార్చి 27 ఆంధ్ర ప్రగతి**

అమరావతి రాజధాని అంశంపై వైసీపీ అధినేత జగన్ తన వైఖరిని స్పష్టం చేయాలని ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. "ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని మా నినాదం. అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. అమరావతి పై మీ స్టాండ్ ఏంటి జే టర్న్ జగన్ గారూ?" అంటూ సోషల్ మీడియా వేదికగా ఆయన సవాల్ విసిరారు. రాజధానిపై తమ ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేస్తూనే, జగన్‌ను లోకేశ్ సూటిగా ప్రశ్నించారు.మరోవైపు, తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో లోకేశ్ ట్వీట్ చేశారు.

"తెలుగువారి ఆత్మగౌరవం కోసం, అణగారిన వర్గాలకు అండగా మన తెలుగుదేశం పార్టీ పుట్టి 44 సంవత్సరాలైంది. తెలుగుదేశం కుటుంబ సభ్యులమైన మనకు ఇది గర్వకారణమైన సందర్భం. ఆవిర్భావ స్ఫూర్తి, ఐకమత్యం చాటే సమయం ఇది. ఇది ఒక చిత్రం కాదు... రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమ, సకల శుభాల గెలుపుకు సంకేతమైన పసుపు జెండా ప్రస్థానం. మీ సోషల్ మీడియా ఖాతాలలో డీపీని పెట్టి, మీ ఇంటిపై పార్టీ జెండా ఎగరేసి 'నేను తెలుగు వాడిని... నాది తెలుగుదేశం పార్టీ' అని గర్వంగా చాటండి" అంటూ లోకేశ్ పిలుపునిచ్చారు.

# మిషన్ కర్మయోగిలో ఎపి ఆదర్శం

**మొదటిపేజీ తరువాయి**

తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ప్రశంసించారు. ఐజీఓటీలో ఏపీ తరఫున కోటికిపైగా కోర్సులు పూర్తి చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కర్మయోగి భారత్ చేసిన ట్వీట్‌ను ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు రీట్వీట్ చేశారు. ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మరో ముఖ్యమైన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి 8 వరకు 'సాధన సప్తాహ' జాతీయ లెర్నింగ్ వీక్‌ను నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వారం రోజులపాటు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు చురుకుగా పాల్గొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) కోర్సును పూర్తి చేయడం తప్పనిసరి చేయడం జరిగిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వ్యవస్థను ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మార్చి ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించాలనే లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం పెట్టుకుందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని, సామర్థ్యాలను పెంచుకోవాలని కోరారు. ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయడం, మెరుగైన సేవలు అందించడమే 'సాధన సప్తాహ' ఉద్దేశమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# కుట్ర కోణం

**మొదటిపేజీ తరువాయి**

అనుమానం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు.శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులోని రామాలయంలో పూజలకు వెళుతున్న సమయంలో రఘురామకృష్ణరాజు, ఆయన అనుచరులు, జనసేన నాయకులపై కొందరు వ్యక్తులు ఆయుధాలతో దాడికి పాల్పడ్డారని పవన్ వెల్లడించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "హిందువులు అత్యంత పవిత్రంగా జరుపుకొనే శ్రీరామ నవమి రోజున ఈ దాడి జరగడం దారుణం. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

ఈ ఘటనను అత్యంత తీవ్రమైనదిగా పరిగణించాలని, దాడి వెనుక ఉన్న సూత్రధారులను విచారణ ద్వారా గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని పోలీసులకు సూచించారు. ఈ దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

# రాజకీయాలకు బ్రేక్.. ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**మార్చి 27 ఆంధ్ర ప్రగతి**

నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆటల బరిలోకి దిగనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్2026' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి.

ఈ విషయాన్ని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభలో అధికారికంగా ప్రకటించారు. ఈ క్రీడల నిర్వహణ కోసం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఛైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కో-ఛైర్మన్‌గా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడంతో పాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడలతో పాటు



రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఘనంగా ఏర్పాటు చేయనున్నారు.

ఈ పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్యే మకన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులను నియమించారు. గురువారం నాడు కమిటీ సభ్యులు సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 28న మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభమవుతాయని కమిటీ స్పష్టం చేసింది. అంతకుముందు మంత్రులు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి.. స్పీకర్‌ను కలిసి స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు.

## కంబగిరి స్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రి బిసి కి ఆహ్వానం..!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 27:**
ప్రముఖ వైష్ణవ క్షేత్రము మండల కేంద్రమైన ఆవుకు గ్రామ సమీపంలో కొండ కోనల మధ్య వెలసిన శ్రీ కంబగిరి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర రోడ్డు భవనములు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి ఆలయ ఈవో యం. రామక్రిష్ణ శుక్రవారం ఆహ్వానించారు. బనగానపల్లె పట్టణంలోని మంత్రి స్వగృహము నందు ఈవో సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి శేష వస్త్రములు, శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈనెల 29 నుండి ఏప్రిల్ 3 వరకు జరుగు కంబగిరి నరసింహస్వామి కళ్యాణోత్సవ బ్రహ్మోత్సవములకు హాజరు కావలసిందిగా ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా సమయానుకూలంగా హాజరు కాగలనని, ఈ ఉత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేసి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని అన్నారు.



## పుల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ మార్చ్ 27:**
నంద్యాల మండలంలోని పుసులూరు గ్రామం వైఎస్ఆర్సిపి నాయకుడు పుల్లయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. నేడు మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పుసులూరు గ్రామంలో వారి నివాసానికి వెళ్లి పుల్లయ్య కుటుంబ సభ్యుల ను పరామర్శించారు గ్రామంలో పార్టీ కోసం ఎంతో కృషి చేశారని వారి కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరియు శిల్పా కుటుంబం అండగా ఉంటుందని పుల్లయ్య కుటుంబానికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ ఆర్.టి.ఐవింగ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపిటిసి ముక్కర సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ రామసుబ్బయ్య, సుధాకర్ రెడ్డి, మరియు గ్రామ వైసీపీ నాయకులు పాల్గొన్నారు

## కనుల విందుగా కళ్యాణం, గ్రామోత్సవం

**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల మార్చి 27:**
శిరివెళ్ల మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణం కనుల విందుగా నిర్వహించారు. గ్రామ పెద్దలు ప్రముఖులు హాజరై విశేష పూజలు నిర్వహించగా భక్తులు సీతారాముల కళ్యాణాన్ని కనులారా వీక్షించారు. కళ్యాణ కార్యక్రమాలను ఆలయ పూజారి వసంత కుమార్ శాస్త్రోక్తంగా సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. అనంతరం వడపప్పు పానకం భక్తులందరికీ పంచి పెట్టారు. కర్నూలు కడప జాతీయ రహదారి వెంట వెళ్లే ప్రయాణి కులను, వాహనాలను ఆపి ప్రతి ఒక్కరికి అందించారు. సాయంత్రం 7 గంటల నుండి గ్రామ పుర వీధుల గుండా ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతి ఇంటింటి వద్దా ఉత్సవ విగ్రహాలకు కాయ కర్పూరం సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవ విగ్రహాల వెంట కోలన్న కళా కారుల బృందం చే ఆనందోత్సవాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## భౌతిక శాస్త్రవేత్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ సేవలు చిరస్మరణీయం.

### సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ మార్చి 27:**
డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో మార్చి 27 న ఎక్స్ కిరణాలను కనుగొన్న జర్మన్ భౌతిక శాస్త్రవేత్త విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ జయంతి సందర్బంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్పందన, పల్లవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. విల్హేల్మ్ కన్రాడ్ రాంట్జెన్ మార్చి 27 – 1845 న జన్మించారు ఈయన జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. ప్రపంచంలో వైద్యరంగంలో రోగనిర్ధారణకు (రేడియోగ్రఫీ) మరియు రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న శాస్త్రవేత్త. ఈయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగలములోనే కాక భద్రతా రంగంలో ఉపయోగపడుతున్నాయి. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో గల ఎక్స్– కిరణాలను కనుగున్నాడు ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు నోబెల్ బహుమతి పొందాడు. ఈయన1923 ఫిబ్రవరి 10 స్వర్గస్తులైనారు. ఇలాంటి మహానుభావులను స్మరించుకుంటు వారి అడుగుజాడలల్లో నడవాలని విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.



# జిల్లాలో "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్స్" అమలుకు కట్టుదిట్టమైన చర్యలు

### స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 27:**

స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్స్" (వ్యర్థ రహిత సంస్థలు) థీమ్ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ, ప్రభుత్వ కార్యాలయం, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం తదితర సంస్థల్లో సమగ్రంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ అమలుపై అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్' థీమ్‌తో స్థిరమైన పారిశుద్ధ్య సంస్కృతికి నాంది పలికే ఉద్యమంగా భావించి కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి సంస్థను వ్యర్థ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

**వ్యర్థాల వర్గీకరణలో 100% అమలు - మూలంలోనే పరిష్కారం**
ప్రతి గృహం, ప్రతి సంస్థ స్థాయిలోనే తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేయడం తప్పనిసరి.
తడి వ్యర్థాలను కంపోస్ట్ పిట్లలో లేదా చెత్త నుండి సంపద కేంద్రాల ద్వారా ప్రాసెస్ చేసి సేంద్రీయ ఎరువుగా మార్చాలి. పొడి వ్యర్థాలను శాస్త్రీయంగా సేకరించి రీసైక్లింగ్‌కు పంపించి ఆదాయ వనరుగా మలచాలి.
ప్రమాదకర వ్యర్థాలను విడిగా సేకరించి సంబంధిత



సంస్థలకు అప్పగించాలి.
ప్రతి ప్రభుత్వ సంస్థలో మౌలిక సదుపాయాలు తప్పనిసరి గ్రీన్ (తడి), బ్లూ (పొడి), రెడ్ (ప్రమాదకర) డస్ట్‌బిన్‌లను ప్రతి కార్యాలయం, పాఠశాల, అంగన్వాడీలో ఏర్పాటు చేయాలి. ప్రతి సంస్థలో కంపోస్ట్ పిట్ నిర్మాణాన్ని రేపటి నుంచే ప్రారంభించాలి.
వర్షపు నీటి నిల్వ కోసం రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను శాస్త్రీయంగా ఏర్పాటు చేయాలి.

**ప్లాస్టిక్ రహిత వాతావరణం పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం**
సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి.
ప్రతి సంస్థను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు హరిత రాయబారులు, స్వయం సహాయక సంఘాలు భాగస్వామ్యం కావాలి.
పరిశుభ్రత కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలి.

**నెట్ జీరో లక్ష్యంతో ముందడుగు**
ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలను సోలార్ పవర్ వైపు మళ్లించాలి.
విద్యుత్ వినియోగంలో పొదుపు అలవాట్లను ప్రతి ఉద్యోగి పాటించాలి.
కంపోస్ట్ ద్వారా తయారైన ఎరువును మొక్కల పెంపకానికి వినియోగించాలి.

**విద్యార్థుల్లో అవగాహన - భవిష్యత్‌కు పునాది**
జీరో వేస్ట్, నెట్ జీరో అంశాలపై పాఠశాలలు, కళాశాలల్లో పోటీలు నిర్వహించాలి. న్నప్పటి నుంచే వ్యర్థాల వర్గీకరణపై అవగాహన కల్పించాలి.

**పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు**
స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలి.
ప్రతి యూనిట్‌లో డస్ట్‌బిన్‌లు, కంపోస్ట్ పిట్లు, ప్లాస్టిక్ ఫ్రీ వాతావరణంపై ఫోటోలు తీసి ఎస్ ఏ ఎస్ ఏ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలి. మునిసిపల్, తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు తమ సొంత నిధులతో సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. అపార్ట్‌మెంట్ అనుమతుల సమయంలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి. బీసీ వెల్ఫేర్, మహిళా శిశు సంక్షేమ, ఐటీడీఏ పరిధిలోని అన్ని సంస్థల్లో జీరో వేస్ట్ విధానాన్ని అమలు చేయాలి. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ సంస్థను "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్"గా తీర్చిదిద్దడం ద్వారా నంద్యాల జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# శ్రీ త్యాగరాజస్వామి దేవస్థానము నందు శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం..!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 27:**
నంద్యాల పట్టణం స్టేట్ బ్యాంక్ కాలనీ లో వెలసిన శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత త్యాగరాజస్వామి దేవస్థానము నందు స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత ఋతువు చైత్ర మాసం శుద్ధ నవమి 27-03-2026వ తేది శుక్రవారం ఉదయం 11గం" 43 ని" లకు మిథునలగ్న శుభ పుష్కరాంశము నందు నంద్యాల జిల్లా నాయి బ్రాహ్మణ ఉద్యోగుల సంస్కృతిక సంక్షేమ సంఘం మరియు ఏపీ నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు శ్రీ త్యాగరాజ స్వామి దేవస్థానం చైర్మన్ ఊడుమాల్పురం మల్లుగాళ్ళ సుబ్బరాయుడు మరియు శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత త్యాగరాజ స్వామి దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో "శ్రీ సీతారాముల వారి కళ్యాణం" అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా శ్రీ సీతారాముల కళ్యాణము, అంతేకాకుండా మహాశివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కళ్యాణం, ప్రతి పండగకి దైవ కార్యక్రమాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ఈ సంవత్సరం శ్రీ సీతారాముల



కళ్యాణం మహోత్సవం సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం జరిపించుటకు తిరుపతయ్య దంపతులు, చిన్న రాంపుల్లయ్య దంపతులు, ఉమాపతి శిరీష దంపతులు, ప్రొద్దుటూరు పుల్లయ్య దంపతులు, కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులందరికీ మధ్యాహ్నం 1:30 ని" అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయం అభివృద్ధిలో భాగంగా భక్తులు వంట సామాన్లలను దేవస్థానానికి విరాళంగా సమర్పించారు, వీరికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం సాయంకాలం



గ్రామోత్సవంలో భాగంగా శ్రీ సీతారాముల లక్ష్మణ హనుమత్ సమేత ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల గుండా మేళ తాళాలతో భాజా భజంత్రీలతో,ఊరేగింపులతో చూచువారికి కనుల పండుగగా కార్యక్రమం నిర్వహించి, పానకం వడపప్పు తీర్థ ప్రసాదాలు చూచువారికి కనుల పండుగగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ మద్దయ్య, శీనయ్య, బాంబే వెంకటేశ్వర్లు, శేఖర్, చిందుకూరు శ్రీనివాసులు, వెంకట్, తిరుపతయ్య, ఏఈ సుబ్రహ్మణ్యం, వేలాది సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రామ గ్రామన ఘనంగా శ్రీరామనవమి వేడుకలు.

### రామాలయాల్లో...వైభవంగా శ్రీరాములోరి కల్యాణోత్సవం.-భక్తులతో కికిటలాడిన ఆలయాలు, గ్రామోత్సవాలు.

### ఎనకండ్లలో రాములోరి కళ్యాణవేడుకల్లో మంత్రి బీసీ జనార్దనరెడ్డి దంపతులు.





**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె, మార్చి 27:**
మండల కేంద్రమైన బనగానపల్లె, చుట్టుపక్కల గ్రామాలలో,వాడవాడలా శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పండుగ వేడుకల్ని ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. జగధబిరాముడు శ్రీరామనవమి వేడుకలు వాడవాడలా అత్యంత ఉత్సహంగా జరుపుకోవడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. శ్రీరామనవమి సందర్భంగా రామలయాల్లో కోదండరాముని కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించటం సంప్రదాయగా వస్తోంది. ఈ ఏడాది కూడా ఆ కల్యాణ రాముని కల్యాణోత్సవం పలు ఆలయాల్లో కనులపండువుగా, కమనీయంగా, రమణీయంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. బనగానపల్లె మండలంలోని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వగ్రామమైన ఎనకండ్లలో శ్రీ రామాలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆయన సతీమణి బీసీ ఇందిరా రెడ్డిలు రాములోరి కళ్యాణానికి పెళ్లి పెద్దలుగా వ్యవహరించి అత్యంత వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. పట్టణంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం,బోయపేట శ్రీ రామస్వామి దేవస్థానం, బుడగజంగాల కాలనీ రామాలయంలో, నాయి బ్రాహ్మణపేటలో, నందవరం, యాగంటిపల్లె,యనకండ్ల, పలుకూరు, టంగుటూరు,సాదుకొట్టం, గ్రామాల్లోని శ్రీ సీతారాముల ఆలయాల్లో రాములోరి కల్యాణోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా జరిగాయి. సీతారాముల ఆలయాల్లో ఉదయం నుండి శ్రీ సీతారామస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజలనంతరం శ్రీ సీతారాముల కళ్యాణం కన్నులపండువగా నిర్వహించారు. కళ్యాణోత్సవానికి ముందుగా లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పాటించి కళ్యాణోత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి పూజ, వృద్ధి అభ్యుదయాలను కాంక్షిస్తూ పుణ్యాహవాచనం, కంకణపూజ, యజ్ఞోపవీత పూజ, నూతన వస్త్ర సమర్పణ, వరపూజ, ప్రవర పఠన, మాంగల్య పూజ, శ్రీ సీతాదేవికి మాంగల్య ధారణ, తలంబ్రాలు, మొదలైన కార్యక్రమాలతో శాస్త్రోక్తకంగా సాంప్రదాయబద్ధంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఆయా ఆలయ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. అనంతరం ఆలయాల్లో భక్తులకు అన్నదాన వితరణ చేపట్టారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు, కోలాటాల మధ్య ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగాయి.

# మహానంది క్షేత్రంలో గ్యాస్ కొరత..
# నిత్యాన్నదానంపై ఎఫెక్ట్.!





**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 27:**
మహానంది క్షేత్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు విశ్వాసనీయ సమాచారం. మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రతిరోజు నిరంతరం కొనసాగుతుంది. ఎంతమంది భక్తులు వచ్చినా కూడా నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఎన్ని అడ్డంకులు ఎదురైనా నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ఇరాన్‌బి ఇజ్రాయిల్, అమెరికా యుద్ధ కారణంగా గత కొన్ని రోజుల నుంచి తీవ్ర గ్యాస్ కొరత మహానందిశ్వర స్వామి దేవస్థానం ఎదుర్కొంటుంది. నిత్య అన్నదాన ప్రసాద వితరణ తో పాటు మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ప్రసాదాలు తయారుచేసి కొంత భాగం ఉచితంగాను 95 శాతం ప్రసాదాల విక్రయం కొనసాగుతుంది. వీటన్నిటికీ ప్రస్తుతం గ్యాస్ కొరత వేధిస్తుంది. అన్న ప్రసాదల తయారీ కేంద్రంలో గ్యాస్ కొరత కారణంగా కట్టెల ద్వారా తయారుచేసి భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కేవలం ఒక్క రోజుకు సరిపడా గ్యాస్ నిల్వలు మాత్రమే మహానంది క్షేత్రంలో అందుబాటులో ఉన్నట్టు తెలుస్తుంది. ఉన్నత స్థాయి అధికారులు గ్యాస్ కొరతపై చర్యలు తీసుకుంటే తప్ప నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగించడం కష్టంగా మారినట్లు తెలుస్తుంది. ఉన్నత స్థాయి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. . ఆలయ అధికారులు ఆపసోపాలు పడి ఇతరుల నుండి గ్యాస్ సిలిండర్లు సేకరించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని గత కొన్ని రోజుల నుంచి అతి కష్టమైన కొనసాగిస్తున్నట్లు సమాచారం. పూర్తిస్థాయిలో గ్యాస్ సప్లై కావడం లేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దిన దిన గండం నూరేళ్ళ ఆయుస్సు అన్న విధంగా దేవస్థాన అధికారుల పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది.

## గ్రామీణ ఆరోగ్య రంగ సిబ్బంది కొరతపై లోక్ సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆందోళన.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 27:**భారతదేశంలోని గ్రామీణ ఆరోగ్య రంగ సిబ్బంది కొరత ఆందోళన కలిగిస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం లోక్ సభలో ప్రస్తావించారు.గ్రామీణ ఆరోగ్య సమస్యపై ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో మాట్లాడుతూ దేశంలో బీస్సీ నర్సింగ్ కాలేజీలు 2014లో సుమారు 1,641 నుండి ప్రస్తుతం 2,500కి పైగా పెరిగిన, ప్రతి సంవత్సరం దాదాపు 2 లక్షల నర్సులు తయారవుతున్నప్పటికీ, తక్కువ వేతనాలు, ప్రోత్సాహకాల లేని కారణంగా నర్సులు విదేశాలకు వెళ్లిపోవడం జరుగుతుందని, దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు ప్రభావితమవుతున్నాయన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, నర్సింగ్ సిబ్బంది నిలుపుదల కోసం మెరుగైన వేతనాలు, ప్రోత్సాహకాలు, పని పరిస్థితులు కల్పించాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె. పి నడ్డాను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో కోరారు.

## శ్రీ సుంకులమ్మ దేవాలయంలో వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణం.

### శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా.

### 700 మంది పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 27:**
శుక్రవారం శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా సుంకులమ్మ వీధిలో ఉన్న ఈ సుంకులా పరమేశ్వరి దేవస్థానం ఉత్సవ మండపంలో శ్రీ సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు.

కళ్యాణ దాతలుగా భూమా మల్లికార్జున శెట్టి,బిలకంటి హరినాధ బాబు కుటుంబ సభ్యులు, దేవస్థాన కమిటీ సభ్యులు కలిసి శ్రీ సీతారాముల కళ్యాణం వైభవంగా జరిపించారు. ఆలయ పురోహితులు గుండంపాటి వేణుగోపాల శర్మ, దత్తయ్య శర్మ కళ్యాణ క్రతువు నిర్వహించారు.

కళ్యాణం అనంతరం పలువురు దాతల సహకారంతో 700 మందికి పైగా భక్తులకు పానకం,వడపప్పు, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకులా పరమేశ్వరి దేవస్థానం కమిటీ చైర్మన్ డాక్టర్ గుర్రాల రవి కృష్ణ, కార్యదర్శి చిమ్మా నాగన్న, ఉపాధ్యక్షులు యంచర్ల నరసింహయ్య, సంయుక్త కార్యదర్శి బైగ్గారి మురళి కృష్ణ, కోశాధికారి బైగ్గారి చిన్న ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఓజా ప్రసాద్, బైగ్గారి సురేష్, మనోజ్, ఓజా సుబ్బయ్య (నాగిశెట్టి) తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో అయ్యప్ప స్వీట్స్ మరియు టిఫిన్ షాప్ ఘనంగా ప్రారంభం.

### రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్‌ఎండి ఫయాజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 27:**నంద్యాల పట్టణంలోని బైరమల్ స్ట్రీట్, అమ్మవారి శాల సమీపంలో అయ్యప్ప స్వీట్స్ ప్రొప్రైటర్ రామకృష్ణ నూతనంగా ఏర్పాటు చేసిన “అయ్యప్ప స్వీట్స్ మరియు టిఫిన్ షాప్“ శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ నూతన షాప్ ను టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్‌ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎండి ఫయాజ్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు నాణ్యమైన స్వీట్లు, రుచికరమైన మరియు శుభ్రమైన టిఫిన్లు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రొప్రైటర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందాలని, ప్రజల ఆదరణ పొందాలని ఆయన ఆకాంక్షించారు.ప్రొప్రైటర్ రామకృష్ణ మాట్లాడుతూ తమ వద్ద నాణ్యతకు పెద్దపీట వేస్తామని, వినియోగదారులకు తక్కువ ధరలోనే నాణ్యమైన స్వీట్లు మరియు టిఫిన్లను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, ఉప్పరి కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పరి సురేష్ కుమార్, అనుపూర్ ఈశ్వర్, బింగుమల్లె శ్యామ్ సుందర్ గుప్తా, జాకీర్, స్థానిక నాయకులు, వ్యాపార ప్రముఖులు మరియు రామకృష్ణ కుటుంబ సభ్యులు సుబ్రహ్మణ్యం, అయ్యప్ప, సువర్ణమ్మ, రాగ సుధా, మనోజ్ కుమార్, రామయ్య స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ చంద్రమూర్తికి పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 27:**
శ్రీరామ నవమిని పురస్కరించుకొని న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ భవనం సమీపంలో మందిర్ మార్గ్, గోల్ మార్కెట్, పోలీస్ కాలనీలో చైత్ర మాస శుక్ల పక్షం నవమి తిథినాడు, పునర్వసు నక్షత్రంలో, అభిజిత్ లగ్నంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ సీతా రాముల కళ్యాణం ఢిల్లీలోని తెలుగు పూజ సమితి ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.
ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి శ్రీ సీతా రాములవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. స్వామి వార్ల కళ్యాణం అనంతరం బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరాముల వారి చరిత్ర, నమ్మిన ఉంటూ ఆంజనేయ స్వామి లేకుండా ఉన్న, సీతాదేవి శ్రీ రామచంద్ర మూర్తి విడిపోకముందు నిర్మాణం జరిగి ఒకే శిలపై శ్రీరామ,లక్ష్మణ, సీతా దేవిలు దర్శనం ఇచ్చే పవిత్ర, పుణ్య క్షేత్రం ఒంటిమిట్ట రామాలయం అన్నారు. శ్రీరామచంద్రమూర్తికి అత్యంత నమ్మిన భక్తురాలు శబరి అని ఆ మహా భక్తురాలి పేరు నా కూతురు కు పెట్టానని, ఆ బైరెడ్డి శబరి ప్రస్తుత నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు అని బైరెడ్డి వివరించారు. బైరెడ్డి శబరి ప్రతి ఏటా 44 కిలోమీటర్లు నల్లమల అభయారణ్యంలో కలనడకన శ్రీశైలం వెళ్లి దర్శనం చేసుకుంటుందని, మార్గమధ్యలో అడవి బిడ్డలు ( చెంచుల) సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం ద్వారా పరిష్కారం కోసం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కృషి చేస్తుందన్నారు.
2015 అక్టోబర్ 2 వ తేదీన భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వచ్ఛ భారత్ కార్యక్రమం ఇక్కడి నుంచే ప్రారంభించారని, గత 30 ఏళ్లుగా ఢిల్లీ తెలుగు పూజ సమితి పేరుతో శ్రీరామనవమి రోజు శ్రీ సీతా రాములవార్ల కళ్యాణం, అన్న ప్రసాద వితరణ, ఇతర సేవా కార్యక్రమాలు చేస్తూ శ్రీరామచంద్రమూర్తి ఆదర్శాలు, ధర్మం, నీతిని స్మరించుకోవడం, భవిష్యత్ తరాలకు నిర్వాహకులు తెలియజేయడం అభినందనీయమని బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఈ ప్రత్యేక పూజల్లో ఢిల్లీ రిటైర్డ్ ఎస్ ఐ శ్రీనివాస్, ఢిల్లీ తెలుగు పూజ సమితి, ఆంధ్ర వనిత మండలి ఢిల్లీ జనరల్ సెక్రటరీ అనసూయ, మినిస్టర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ తోట. హనుమంతరావు, డి ఓ పి టీ డైరెక్టర్ ప్రసాద్ రావు, మినిస్టర్ ఆఫ్ స్టీల్ ఏ ఎస్ ఓ రామప్రసాద్, దుర్గా కళ్యాణం తదితరులు శ్రీ సీతారాముల కళ్యాణంలో బైరెడ్డి రాజశేఖరరెడ్డి వెంట పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి సందర్భంగా ఘనంగా అన్నదాన కార్యక్రమం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 27:**
శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని కాశెట్టి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని చిన్మయ స్కూల్ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి కాశెట్టి చంద్రశేఖర్ ఆహ్వానం మేరకు హాజరైన అభిరుచి మధు, శ్రీరాముని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజ సేవలో భాగంగా నిర్వహిస్తున్న ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో భక్తులకు విశేషంగా అన్నదానం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ట్రస్టు సభ్యులు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రముఖులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## అగ్గిపెట్టె మీద సూక్ష్మ చిత్రాలతో రామాయణం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 27:**
నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని చిన్న అగ్గిపెట్టె మీద మైక్రో పెన్నుతో, మైక్రోబ్రష్ లతో వాటర్ కలర్స్ పెయింటింగ్స్ తో మూడు గంటల సమయంలోనే రామాయణం లోని ప్రధాన ఘట్టాలు వేసారు.కేవలం రెండు ఇంచెస్ పొడవు, రెండున్నర ఇంచెస్ వెడల్పు గల అగ్గిపెట్టె పై (ఇంచెస్ అంటే అంగుళాలు)ఆయన ఉహాలో మె దిలే రామాయణం లోని ప్రధాన అంశాలు వేసానని తెలిపారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ నేను వేసిన ఈ చిత్రం లో శ్రీరాముని జననం నుండి సీతా దేవి అగ్ని పరీక్ష వరకు వుంటుంది. సాక్షాత్ శ్రీ మహావిష్ణువే త్రేత యుగంలో శ్రీరాముడిగా దశరథ మహారాజుకు, కౌసల్య కు జన్మించారు. శ్రీరాముడు సత్యవంతుడు, దయామయుడు, పురు షోత్తముడు, పరాక్రమవంతుడు, ఆదర్శ ప్రాయుడు, పితృ వాక్యపరిపాలకుడు. తండ్రి మాట కోసం 14 ఏళ్ళు వనవాసం చేసిన ఆదర్శ కుమారుడు. ఏకపత్ని వ్రతుడు. సోదరులను ఎంతో ఆప్యాయంగా చూసుకునేవాడు. ప్రజలను కన్న బిడ్డలాగ చూసుకునేవారు. శ్రీరామచంద్రుడు ధర్మ మార్గాన్ని ఆచరిస్తారు కాబట్టి అందరికి ఆదర్శప్రాయుడు. అందుకే రామాయణం గురించి ఎన్ని సార్లు విన్న, రామాయణం గురించి ఎన్ని సార్లు బొమ్మలు వేసిన తనివి తీరదు.నేను వేసిన ఈ చిత్రం లో దశరథ మహారాజుకు ముగ్గురు భార్యలు కౌసల్య, సుమిత్ర, కైకేయి వారు తమ పిల్లలైన రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను ముద్దాడు తున్నట్లు, రామ, లక్ష్మణులు విశ్వామిత్రుని దగ్గర శిష్యరికంలో వున్నట్లు, యజ్ఞం భంగం చేస్తున్న రాక్షసులను రామలక్ష్మణులు సంహరిస్తున్నట్లు, అహల్య శాప విమోచన, రాముడు శివ ధనుస్సు విరిచినట్లు,సీతారాముల కళ్యాణం, తండ్రి దగ్గర సెలవు తీసుకొని వనవాసం వెళుతున్న రామ, లక్ష్మణ, సీతమ్మ, రాముని పాదరక్షలు తీసుకుంటున్న భరతుడు, రామునికి జింకను చూపిస్తున్న సీతమ్మ, మారు వేషంలో రావణుడు, సీతాదేవిని అపహరించి పోతున్నప్పుడు సీతమ్మ కాపాడుట కోసం జటాయువు అనే పక్షి అడ్డం వస్తే దాన్ని రెక్కలు రావణుడు నరుకుతున్నట్లు, రామునికి ప్రేమతో పళ్ళు తినిపిస్తున్న శబరి,వాలి సంహారం, సీతమ్మ జాడ కోసం హనుమంతుడు ఆకాశంలో పోతున్నట్లు, సీతా దేవి ఇచ్చిన చూడామణిని హనుమ తీసుకున్నట్లు, లంకా దహనం, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తులతో యుద్ధం చేస్తున్న రామలక్ష్మణులు, యుద్ధంలో మూర్ఛ పోయిన లక్ష్మణుడు, సంజీవ పర్వతం తెస్తున్న హనుమాన్, రామ రావణ యుద్ధంలో రావణుడి సంహారం, అగ్ని పరీక్షలో మహా సాధ్వి సీతమ్మ వున్నట్లు ఇలా ఇన్ని ప్రధాన ఘట్టాలను చిన్న అగ్గిపెట్టె పై వేసాను. శ్రీరాముని మీద వున్నా భక్తితో ఈ చిత్రం వేసాను. భక్తులందరికి ఆ రామయ్య ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను.

# ఉమ్మడి కర్నూలు జిల్లాలో..

# 21 కొత్త మరియు అదనపు కోర్టులు ఏర్పాటు.

**న్యాయ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రత్యేక కృషితో..! కర్నూలు, నంద్యాల లో జిల్లా జడ్జి క్యాడర్ కోర్టులు.**

**ఆదోని, ఎమ్మిగనూరులో సీనియర్ సివిల్ జడ్జి క్యాడర్ కోర్టులు.**

**శ్రీశైలంలో కొత్త జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు.**

**మరో 16 జూనియర్ సివిల్ జడ్జి కం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులు కూడా.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు/నంద్యాల మార్చి27:**
రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కొత్త మరియు అదనపు కోర్టుల ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర పడిన నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏకంగా 21 కొత్త మరియు అదనపు కోర్టులు ఏర్పాటు కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిగా, ప్రస్తుతం నంద్యాల అసెంబ్లీ స్థానం నుండి శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ఎన్ఎండి ఫరూక్ స్థానిక జిల్లాల్లో కొత్త కోర్టు ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. ఈ నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ సంఖ్యలో కొత్త కోర్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో న్యాయవాద వర్గాల్లో హర్షాతిరేఖాలు వ్యక్తం అవుతున్నాయి.

## పెండింగ్ కేసుల పరిష్కారం కోసం

రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో పెండింగ్ కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని , వాటి పరిష్కారం కోసం, సత్వర న్యాయం కోసం కొత్త కోర్టులు మరియు అదనపు కోర్టు లను ఏర్పాటు చేసేందుకు న్యాయశాఖ ప్రత్యేక చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా పెండింగ్ కేసుల సంఖ్య ఆధారంగా 2026-2027 ఆర్థిక సంవత్సరంలో హైకోర్టు రిజిస్ట్రార్( పరిపాలన విభాగం) ప్రతిపాదించిన 96 కొత్త మరియు అదనపు కోర్టులు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గ సమావేశం ఆమోదముద్ర వేసింది. కొత్త మరియు అదనపు కోర్టు ల్లో విధి నిర్వహణ కోసం 1730 పోస్టులు సృష్టించుటకు కూడా ఆమోద ముద్ర వేయడం జరిగింది.

## ఉమ్మడి జిల్లాలో 21 కోర్టుల ఏర్పాటు

ఉమ్మడి కర్నూలు జిల్లా లోని వివిధ నియోజకవర్గాల పరిధిలో 21 కొత్త మరియు అదనపు కోర్టు లు ఏర్పాటు కానున్నాయి. ఇందులో రెండు అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులు, రెండు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు,17 జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 12 జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులలో భాగంగా ఉమ్మడి జిల్లాలో కర్నూలులో 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు, నంద్యాలలో 9వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయడం జరుగుతుంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మంజూరైన 25 సీనియర్ సివిల్ జడ్జి కోర్టులలో భాగంగా, ఉమ్మడి జిల్లా పరిధిలో ఆదోనిలో ఒకటవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఎమ్మిగనూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయనున్నారు. జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుల ఏర్పాటు లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 59 కోర్టుల్లో, ఉమ్మడి కర్నూలు జిల్లా కు 17 కోర్టులు మంజూరు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇందులో ఆదోనిలో మూడవ అదనపు సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, ఆళ్లగడ్డలో ఒకటవ, ఆలూరు లో ఒకటవ, ఆత్మకూరులో ఒకటవ, బనగానపల్లెలో ఒకటవ, డోన్ లో రెండవ, కర్నూలులో 5,6,7,8 వ అదనపు కోర్టులు, నందికొట్కూరులో ఒకటవ, నంద్యాలలో 2,3,4 అదనపు సివిల్ జడ్జి కోర్టులు, పత్తికొండలో ఒకటవ, ఎమ్మిగనూరులో ఒకటవ అదనపు సివిల్ జడ్జి కోర్టులు ఏర్పాటు కానున్నాయి. కాగా శ్రీశైలంలో కొత్తగా జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేస్తున్నారు.

## పెండింగ్ కేసుల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు - రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.



భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నిర్దేశించిన ప్రకారం ఏ కేసు కూడా ఐదు సంవత్సరాలకు మించి పెండింగ్ లో ఉండరాదు.రాష్ట్రంలో పెండింగ్ కేసుల సంఖ్య 01-01-2019 నాటికి 5,38,020 ఉండగా, ఈ సంఖ్య 01-01-2025 నాటికి 8,93,993 కు చేరింది. కానీ కోర్టుల సంఖ్య మాత్రం ఈ కాలంలో 636 నుండి 660 కి మాత్రమే పెరిగింది.దీంతో పెండింగ్ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది.ఆర్థిక శాఖ 2026-27 కు గాను 100 కోర్టులు ఏర్పాటు చేయుటకు సమ్మతి తెలిపింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న జ్యుడీషియల్ జిల్లాలతో పాటు,రాబోయే కొత్త జ్యుడీషియల్ జిల్లాలలో 172 క్రొత్త మరియు అదనపు కోర్టులు ఏర్పాటు చేసేందుకు హైకోర్టు రిజిస్ట్రార్ (పరిపాలన) వారు ప్రతిపాదన పంపించారు. ఇందులో 96 కోర్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 21 కొత్త కోర్టులు మంజూరు కావడంతో పెండింగ్ కేసుల పరిష్కారంతోపాటు, సత్వర న్యాయ సేవలు సులభతరం గా అందనున్నాయి.రాష్ట్రంలో 96 కోర్టులు, 1730 పోస్టులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రివర్గ సహచరులకు,హై కోర్టుకు మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలిపారు.

## రాయవరం ప్రమాదంలో బస్సు యజమాని అరెస్ట్

**మార్కాపురం,మార్చి 27 ఆంధ్ర ప్రగతి**
మార్కాపురం బస్సు ప్రమాద ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బస్సు యజమాని, డ్రైవర్ పి.హరికృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. రాయవరం వద్ద గురువారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సు- కంకర టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. బస్సు ప్రమాద సమయంలో హరికృష్ణారెడ్డి డ్రైవింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదం తర్వాత ప్రయాణికులను వదిలేసి అతడు పరారయ్యాడు. నెల్లూరుకు పారిపోతుండగా గురువారం సాయంత్రమే పామూరు శివారులో పోలీసులు అతడిని పట్టుకున్నారు. ఇవాళ సాయంత్రం మార్కాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది.

----------

## ప్రజాసేవే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలు

### కుప్పంలో పలువురికి కుట్టుమిషన్లు పంపిణీ

**చిత్తూరుమార్చి 27 ఆంధ్ర ప్రగతి**




కుప్పం నియోజకవర్గంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30 మందికి తోపుడు బండ్లు, పలువురికి వినికిడి మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను భువనేశ్వరి వివరించారు. ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ పనిచేశారని భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 29 సంవత్సరాలు పూర్తయిందన్నారు. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల ట్రస్ట్ బాధ్యతలు తనకు అప్పగించారని అన్నారు. చంద్రబాబు అందించిన స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళు న్నామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు తమ వంతు సాయం అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కూడా తలసేమియా సెంటర్లు ప్రారంభిస్తామని నారా భువనేశ్వరి ప్రకటించారు.

-----

## సూర్యఘర్ పనులను వేగవంతం చేయాలి


### సిఎండిలను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

**అమరావతి,మార్చి 27 ఆంధ్ర ప్రగతి**



రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎండీలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రణాళికాబద్ధంగా పీఎం సూర్యఘర్ కనెక్షన్లను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. డిస్కంల సీఎండీలతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్-ఎస్ పనుల పురోగతిపై సీఎండీలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రతీ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించే పీఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతంగా చేపట్టాలని మంత్రి తెలిపారు. జగజ్జీవన్ రామ్ జయంతి నుంచి అంబేద్కర్ జయంతి నాటికి ప్రతీ నియోజకవర్గంలో కనీసం 2 వేల కనెక్షన్లు పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్‌కు పెండింగ్‌లో ఉన్న అగ్రికల్చర్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ ప్రమాదాలు, ట్రాన్స్‌ఫార్మర్ చోరీలను అరికట్టేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో శాఖాధికారులు, ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎండి ఫయాజ్.








**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 27:**
నంద్యాల పట్టణంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బైరమల్ స్ట్రీట్ అమ్మవారి శాల సమీపంలో అయ్యప్ప స్వీట్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాల్లో ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని ప్రసిద్ధ ఆంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడ నిర్వహించిన ప్రత్యేక పూజలు, తీర్థప్రసాద వితరణలో ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ.. శ్రీరామచంద్రుని ఆశీస్సులు నంద్యాల ప్రజలందరిపై ఉండాలని, పట్టణం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవడం మన భారతీయ సంస్కృతికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, ఉప్పరి కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పరి సురేష్ కుమార్, అనుపూర్ ఈశ్వర్, బింగుమల్లె శ్యామ్ సుందర్ గుప్తా, జాకీర్ మరియు ఆంజనేయ దేవస్థానం చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, మాజీ కౌన్సిలర్ వాకా శివశంకర్ యాదవ్, వాకా వరప్రసాద్ యాదవ్ స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




## అయోధ్యలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం

**బాలరాముడిపై సూర్యకిరణాలతో తిలకం**

**తిలకించి, పులకించిన భక్తజనం**




**అయోధ్య,మార్చి 27 ఆంధ్ర ప్రగతి**
శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా అయోధ్యలోని భవ్య రామమందిరంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. శుక్రవారం మధ్యాహ్నం సరిగ్గా 12:00 గంటలకు అభిజిత్ ముహూర్తంలో బాలరాముడి నుదుటిపై సూర్య కిరణాలు తిలకంలా మెరిసిపోయాయి. సైన్స్, ఆధ్యాత్మికత కలబోతగా జరిగిన ఈ 'సూర్య తిలకం' వేడుకను చూసి లక్షలాది మంది భక్తులు పులకించి పోయారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ సూర్య తిలక వేడుకను నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 గంటలకు ప్రారంభమై సుమారు కొన్ని నిమిషాల పాటు ఈ కాంతి తిలకం రామ్ లల్లాను ప్రకాశింపజేసింది. ఐఐటీ రూర్కీ శాస్త్రవేత్తల నేతృత్వంలో రూపొందించిన ఆఎ÷-టో-మెకానికల్ సిస్టమ్ ద్వారా సూర్య కిరణాలు నేరుగా విగ్రహంపై పడేలా ఎ÷-లాన్ చేశారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు దేశ విదేశాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు అయోధ్య అంతటా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా భక్తులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. సూర్య కిరణం రామ్ లల్లా నుదుటిపై పడగానే భక్తులు 'జై శ్రీరామ్' అంటూ చేసిన నినాదాలతో అయోధ్య నగరం మారుమోగిపోయింది. సూర్యవంశీయుడైన శ్రీరాముడికి సూర్యభగవానుడే స్వయంగా తిలకం దిద్దినట్లుగా ఉన్న ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అద్భుతం భక్తులకు కనువిందు చేయడమే కాకుండా భారతీయ ఇంజనీరింగ్ నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.



-------------------